ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





మళ్లీ నిరాశే



❁కోస్తా రైలు మార్గంపై శీతకన్ను ❁రైల్ నీరు ప్రాజెక్టుకూ నిధులు నిల్
❁విజయవాడ - ఖాజీపేట డబ్లింగ్ ప్రస్తావన లేదు ❁రాజధానికి రైలు మార్గం విస్మరణ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల అభివృద్ధికి అవసరమైన కీలక ప్రాజెక్టులకు మరోసారి మొండి చేయి చూపింది. మచిలీపట్నంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను మంజూరు చేసి చేతులుదులుపుకుంది. ప్రజల జీవనోపాధి పెంచడానికి అవసరమైన వ్యవసాయం, ఉపాధి హామీ చట్టాలకు నిధుల కేటాయింపుల్లో కోత పెట్టింది. పర్యాటక కేంద్రాల వృద్ధికి నిధులు కేటాయించకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైల్వేలకు రూ.2.40 లక్షల కోట్లు కేటాయించింది. కానీ మచిలీపట్నం ఎంపి ప్రతిపాదించిన మచిలీపట్నం-రేపల్లె నూతన రైలు మార్గానికి ఎటువంటి కేటాయింపులు చేయలేదు. కోస్తా ప్రాంత అభివద్ధికి 216 జాతీయ రహదారి విస్తరణ, పులిగడ్డ పెనుమూడి వారధి నిర్మాణంతోపాటు కోస్తా (మిగతా 6లో)

నిధుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం : టిడిపి కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణ, నెట్టెం రఘురామ్

బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. 22 మంది వైసిపి ఎంపీలున్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. విభజన హామీల్లో భాగంగా వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి, విశాఖలో రైల్వే డివిజన్ ఏర్పాటు గురించిన ఊసే లేదు. ముఖ్యంగా జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి నిధలు కేటాయించకపోవడం శోచనీయం. ప్రత్యేక హోదా ఊసే లేదు.

బీమా వ్యాపారాన్ని బలహీనపరిచే చర్యలు : జి.కిషోర్ కుమార్, ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి

బీమా ప్రీమియంపై ఇచ్చే పన్ను రాయితీలు తొలగించేలా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవడం పొదుపును, బీమా వ్యాపారాన్ని బలహీనపరిచే చర్య. బీమారంగ వృద్ధికి ఏ విధంగానూ ప్రోత్సాహాలు ఇవ్వకపోవగా పాలసీదారులకు భారంగా పరిణమించే బీమా ప్రీమియంపై జిఎస్‌టిని తగ్గించేందుకు ప్రతిపాదన చేయకపోవడం ప్రజల పొదుపుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఉద్యోగులు చెల్లించాల్సిన పన్ను శ్లాబులు ప్రకటించినప్పటికీ ఉద్యోగులు చెల్లించాల్సిన పన్నులో పెద్దగా మార్పు లేకపోవడం ఉద్యోగవర్గాన్ని నిరుత్సాహపరిచింది.

నర్సింగ్ కళాశాల మంజూరు హర్షణీయం బందరు ఎంపి బాలశౌరి

మచిలీపట్నంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను మంజూరు చేయడం సంతోషకరం. దీని ద్వారా బందరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని విద్యార్థులకు నర్సింగ్ వైద్యవిద్య అందుబాటులోకి వస్తుంది. ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయి. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు (మిగతా 6లో)

రాష్ట్రానికి మరోసారి అన్యాయం : పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

విభజన హామీలు అమలు చేయకుండా, బడ్జెట్లో నిధులు కేటాయించకుండా ఆంధ్రులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసింది. విభజన హామీలు అమలు చేయడంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగానికి పునరుజ్జీవం కల్పించడానికి తగిన చర్యలు బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు. ఉపాధి కల్పన దిశగా బడ్జెట్ ప్రతిపాదనలు లేవు. విద్యా రంగంలో సార్వత్రిక విద్యకు తగిన విధంగా నిధులు కేటాయించలేదు.

రైల్వే ప్రాజెక్టుల విస్మరణ : సిపిఎం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు వై.నరసింహారావు, డివి.కృష్ణ

విజయవాడ రైల్వే డివిజన్లో పలు ప్రాజెక్టులను విస్మరించారు. రైల్ నీర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదు. విజయవాడ -ఖాజీపేట డబ్లింగ్ పనులను విస్మరించారు. కృష్ణాడెల్టా స్థిరీకరణకు ఉపయోపడే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, మచిలీపట్నం-రేపల్లె నూతన రైలు మార్గానికి బడ్జెట్లో కేటాయింపుల్లేవు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేని దుస్థితి ఉంటే ఆర్థిక సర్వేలో ఎంఎస్‌పి ఇచ్చామని కేంద్రం బుకాయిస్తోంది. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా హామీ ఇచ్చిన ఎంఎస్‌పి చట్టం గురించి ప్రస్తావించలేదు. సంక్షేమ పథకాల్లో కోత విధించడానికి వీధి వ్యాపారులు, చిరు వ్యాపారుల వద్ద నుంచి కూడా పాన్ కార్డ్ కావాలని కోరడం దారుణం.

వేతన జీవులకు నిరాశే : ఎపిఎన్‌జిఓస్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

బడ్జెట్లో వేతన జీవులకు మళ్లీ నిరాశే ఎదరైంది. గత దశాబ్ద కాలంగా రూ.2.5 లక్షలున్న ఆదాయపు పన్ను మిహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతారని ఆశిస్తే కేవలం రూ.3 లక్షలకు పరిమితం చేయడం ద్వారా ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం కలగదు. రూ.7 లక్షల వరకు ఆదాయ పన్ను ఉండదని చెప్పినా దాని వలన కూడా ఉద్యోగులు పెద్ద ప్రయోజనాని పొందరు. ఆదాయ పన్ను విషయంలో వేతన జీవులకు బడ్జెట్ ద్వారా స్వల్ప ప్రయోజనమే కలుగుతుంది.

బ్లాక్‌లో యూరియా!

❁ఆర్‌బికెల్లో స్టాక్ నిల్ ❁ప్రైవేటు వ్యాపారుల హవా
❁సోషల్ మీడియాలో పోస్టులు ❁కదిలిన యంత్రాంగం



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఎరువుల విక్రయాలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడింది. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా దొరక్క రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని ఆసరా చేసుకుని కొందరు ప్రయివేటు వ్యాపారులు 45 కిలోల యూరియా బస్తాపై ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా రూ.63 వరకు అదనంగా దండుకుంటున్నారు. వ్యాపారుల బ్లాక్ మార్కెట్ దందాపై రైతులు వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడంతో కృష్ణాజిల్లా యంత్రాంగంలో కదలిక వచ్చింది. యూరియా సరఫరాకు చర్యలు తీసుకుంటోంది.

ప్రాజెక్టుల్లో నీరు లేదని, కాల్వలకు ముందస్తుగా మరమ్మతులు చేపడతామని చెబుతూ ఈ ఏడాద రబీలో వరి సాగుకు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో 2.35 లక్షల ఎకరాల్లో అపరాలు సాగు చేశారు. అపరాలసాగుకు ఎటువంటి ఎరువులను వినియోగించరు. విద్యుత్ మోటర్లు అందుబాటులో ఉన్న రైతులు బోర్ల నీటిని తోడుకుని ఇతర పంటలు సాగు చేశారు. 11 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 4 వేల ఎకరాల్లో వరి, ఐదు వేల ఎకరాల్లో కూరగాయలు, స్వల్ప విస్తీర్ణంలో చెరకు పంటలను సాగు చేశారు. పంట ఎదుగుదల దశలో ఎక్కువగా యూరియాను వినియోగిస్తారు. మొక్కజొన్న, చెరకు పంటలకు 45 కిలోల యూరియా బస్తాలు ఎకరానికి సగటున ఎనిమిది నుంచి 10 బస్తాలు అవసరం అవుతాయి. ధాన్యం సంచుల నిల్వలు, నమోనాల పరిశీలన యంత్రాలు, డేటా ఎంట్రీ కంప్యూటర్‌లతో కొన్ని ఆర్‌బికెలు నిండిపోయి ఉన్నాయి. దీంతో (మిగతా 6లో)

ఎండుతున్న వరి

❁సాగునీరు కరువు

❁తారకరామ ఎత్తిపోతల నుండి నీరు నిల్



ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద గ్రామాల పరిధిలో తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద సాగునీరు సరిగా సరఫరా కాకపోవడంతో సుమారు 1,000 ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. రబీ సీజన్‌లో ఏటా సుమారు 1,000 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. అయితే తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అధికారులు సాగునీటిని సకాలంలో అందించలేకపోవడంతో ఈ ఏడాది రైతులు వరి నాట్లను ఆలస్యంగా వేశారు. ఏటా కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద రైతులు సాధారణంగా ఖరీఫ్, రబీ సీజన్లలో రెండు పంటలు సాగుచేస్తారు. ఈ ఏడాది కష్ణానదిలో సాగునీరు సరిపడా లేకపోవడంతో రబీ సీజన్‌లో వరి సాగు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సూచించింది. అయితే తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ నుండి ఏడాది పొడవునా తిరుగు నీరు (రిటన్ వాటర్) అందుతోంది. దీంతో రైతులు రబీ సీజన్‌లో కూడా వరి సాగు చేస్తారు. ఇదిలా ఉంటే తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కాల్వలో నీరు ఉన్నా, నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి. అలాగే ప్రతి వర్షాకాలంలో లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వ ఎగువన ఉన్న గ్రామాల్లోని పంట పొలాలు మునిగిపోతున్నాయి. వచ్చే ఏడాది సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఈ ఏడాది ఆ గ్రామ రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కాలువలో నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నారు. ఫలితంగా ఎన్‌టీటీపీఎస్ రిటర్న్ వాటర్ అందకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. ఈదశలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కాల్వ ఎగువ గ్రామ రైతుల నుంచి వచ్చిన సూచన మేరకు కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కాల్వను లోకల్ అప్రోచ్ ఛానల్‌తో అనుసంధానం చేస్తున్నారు. తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కాల్వ నుంచి నీరు వథాగా పోకుండా గతంలో నిర్మించిన కాంక్రీట్‌ను రైతులు ధ్వంసం చేసి నీటి ప్రవాహానికి తూము ఏర్పాటు చేశారు. అందుకు రైతులు సాగు చేసిన వరి పొలాల ఆధారంగా ఒక్కొక్కరు రూ.10వేలు (మిగతా 6లో)

20న ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్ష

- వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.మనోహర్, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ప్రజ్ఞా వికాసం పేరుతో 10 వ తరగతి మోడల్ పరీక్ష ఈ నెల 20 వ తేదీన నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.మనోహర్, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం. సోమేశ్వరరావులు తెలిపారు. నున్న హైస్కూల్‌లో బుధవారం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. పరీక్షలో పదోతరగతి విద్యార్థులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈనెల 20వ తేదీన మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఈ పరీక్షకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజు 25 రూపాయలు ఉంటుందని అన్నారు. పరీక్ష సమయం మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల 30 నిమిషాల వరక జరుగతుందన్నారు. విద్యార్థులలో భయాన్ని పోగొట్టి మనోధైర్యాన్ని నిలిపేందుకు ప్రముఖ విద్యావేత్త , కష్ణా,గుంటూరు గ్యాడ్యుయేట్ ఎం.ఎల్.సి. కె.ఎస్. లక్ష్మణరావు పర్యవేక్షణలో భారత విద్యార్థి ఫెడరేషన్-ఎస్ఎఫ్ఐ, యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్-యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పరీక్ష "ప్రజ్ఞావికాసం" 10 వ తరగతి విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ పరీక్ష 10 వ తరగతి సిలబస్ నుండి 100 మార్కులకు పరీక్ష ఉంటుందని, ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ఉంటుంద న్నారు. ఫోన్ నెంబరు 9010849524లో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ (హెచ్.ఎం) భూపాలరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మోడల్ పరీక్ష వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

పిఎసిఎస్‌ల పగ్గాలు త్రిసభ్య కమిటీలకే...

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : గ్రామాల్లో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్)పగ్గాలు తిరిగి త్రి సభ్య కమిటీలకే అప్పగించనున్నారు. ఈ మేరకు గ్రామాల వారిగా ప్రతిపాదనలు వెళ్లాయి. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి. రాష్ట్ర విభజన తరువాత ఎన్నికలు 2017లో తిరిగి నిర్వహించాల్సి ఉండగా అప్పటి టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా 2019 వరకు అప్పటి పాలక వర్గాలనే కొనసాగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తొలుత అధికారులను పర్సన్ ఇన్చార్జులుగా నియమిం చింది. తరువాత సహకార వ్యవస్థ చరిత్రలోనే నామినేటెడ్ పద్ధతికి శ్రీకారం చుట్టింది. నామినేటెడ్ పద్ధతి లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ముగ్గురు సభ్యులతో కమిటీలను నియమించింది. వీరంతా వైసిపికి చెందిన వారే. విజయవాడ రూరల్ లో గల సంఘాలకు త్రి సభ్య కమిటీ చైర్మన్ లు ప్రతిపాదించిన పేర్లు ఈ విధంగా ఉన్నాయి. నున్న సంఘానికి పొలారెడ్డి ప్రభాకర్ రెడ్డి (చంద్రారెడ్డి), రామవరప్పాడుకు సాధం వెంకటేశ్వరరావు, నిడమానూరుకు బొప్పన కష్ణ, గొల్లపూడికి బొర్రా వెంకట్రావు, పైడూరుపాడుకు రంగినేని సాంబశివరావు, కె. తాడేపల్లి కి ఎల్. పుండరీకవరద వర్మ(రాజు), కుందావారి కండ్రికకు రవీంద్ర రెడ్డి లు తిరిగి భాద్యతలు చేపట్టానున్నారు.



దేవినేని ఉమా ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గొల్లపూడిలో వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్‌లో నూతనంగా ప్రతిష్ఠించబడిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ వ్యవస్థాపక నిర్మాణ దాతలు నీలి వేంకట యుగంధర్ సతీష్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ శివ ప్రసాద్, సెక్రెటరీ దేవతి నాగేశ్వరరావు, ట్రెజరర్ నీలిశెట్టి చెన్న కేశవులు, వైస్ ప్రెసిడెంట్ అత్యం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

178వ రోజూ కొనసాగిన అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోనీ శ్రీరాం రాజగోపాల్ అధ్వర్యంలో నిర్విరామంగా అన్నా క్యాంటీన్ కొనసాగుతోంది. జగ్గయ్యపేట అన్న క్యాంటీన్‌లో 178వ రొజు బుధవారం జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో 644 మంది భోజనం చేశారు. చావా సతీష్ పేరున వారి తల్లితండ్రులైన చావ బడే మియా, స్వర్ణకుమారి ల వితరణతో అన్న క్యాంటీన్లో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని చావా బడే మియా, మైనేని రాధాకష్ణ, గుత్తా సురేష్ , గుత్తికొండ శ్రీనుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, పద్మనాభుని కుటుంబరావు, మొల్ల కష్ణారావు, చావా నాగేశ్వరరావు, మాలెంపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలతో సుపరిపాలన : వంశీ


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీ

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : రాష్టంలో సిఎం జగన్ సుపరిపాలన అందజేస్తున్నారని, సంక్షేమ నవరత్నాలు ఇంటికే నేరుగా వచ్చేలా చేశారని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్, నైనవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ ఇంటింటికి వెళ్లి మూడేళ్లుగా కుటుంబాలు పొందిన లబ్ధిని వివ రించారు. ప్రజలు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరించేం దుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సాంకేతిక కారణాల వలన సంక్షేమం అందనివారి సమ స్యను పరిష్కరించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొమ్మ కోట్లు,సోమయ్య,సువర్ణ రాజు, ప్రసన్న కుమారి, నాగిరెడ్డి, దేవేంద్రరరావు, అధికారులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలతో జీవితం నాశనం : సిఐ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మత్తు పదార్థాల వైపు వెళ్లి జీవితాలను చిత్తు చేసుకోవద్దని జగ్గయ్యపేట సిఐ ఎ. నాగమురళి అన్నారు. పట్టణంలోని జేఆర్సి జూనియర్ కళాశాలలో బుధవారం మాదకదవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ మురళి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. చిన్నతనం నుండే మత్తు పదార్థాలు గుట్కాలు గంజాయి లిక్కర్ వంటి వాటి వైపు వెళ్ళవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎస్సై బీవీ రామారావు, జెఆర్సి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు దుర్గాప్రసాద్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిల్లకల్లు పోలీస్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా' అనే కార్యక్రమం పై మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు చిల్లకలు ఎస్సై దుర్గ ప్రసాద్ అవగాహన కల్పించారు. చిల్లకల్లు మహిళా పోలీసులు పూర్ణిమ, పవిత్ర, స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపితోనే బడుగుల జీవితాల్లో వెలుగు : ఎంఎల్‌ఎ



ప్రజాశక్తి కంచికచర్ల : అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ జగన్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు భరోసా కల్పిస్తుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. కంచికచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో 16, 17 వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనారిటీల జీవితాలలో వెలుగులు తెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని అన్నారు. ఎస్టి ఎస్సీ బీసీలను రాజ్యాధికారంలో భాగం చేస్తూ మంత్రివర్గ విస్తరణలో కూడా వారికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎంపీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి కార్యదర్శి కనగాల రవికుమార్, వైసిపి నాయకులు తదితరుల పాల్గొన్నారు.

తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా

- నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-వత్సవాయి

మండలంలోని కన్నెవీడు ఇసుక క్వారీ నుండి తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం పట్టణానికి ఇసుక అక్క రవాణా జోరుగా సాగతోంది. కన్నెవీడు క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్లకు, టిప్పర్లకు, లోడింగ్ చేస్తున్నారు. క్వారీలో పది అడుగుల మేర వరకు లోతు వరకు కూడా ఇసుకను తవ్వి బయటకు తీస్తున్నారు. రెండు ప్రోక్లైన్లతో రాసి పోసి, రోడ్డు వేసి ట్రాక్టర్లకు, టిప్పర్లకు లోడ్ చేస్తున్నారు. వర్షాకాలంలో వరదల ప్రభావంతో ఇసుక మేటలు వేయటమే కాకుండా, లోయలు ఏర్పడి, పశువుల కాపర్లు, గొర్రెల కాపర్లు, గేదలు మునిగిపోయి కొట్టుకుపోవటమే కాకుండా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది అని గేదెల కాపర్లు అంటున్నారు. గతంలో ఇందుకుపల్లి క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా గోతులు పెట్టి ఇసుక తరలించడంతో వర్షాకాలంలో వరదల ప్రభావం వల్ల ఇద్దరు యువకులు మునిగిపోయి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ కన్నివేడు క్వారీలో అధికారులు సైతం కూడా కన్నెత్తి చూడకపోవడం చాలా విచారకరం. టన్ను ఇసుక 475 రూపాయలు ఉండగా ఒక ట్రాక్టర్ కు 2400 రూపాయలు తీసుకొని ట్రాక్టర్ డ్రైవర్ కు వంద రూపాయలు తిరిగి ఇస్తున్నట్లు సమాచారం. కాటా వేయించకుండానే ఇష్టానుసారంగా ఓవర్ లోడ్‌లతో చేస్తూ జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే కూపన్‌పై రెండు మూడు సార్లు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్టు ప్రజల బహిరంగ చర్చించుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా గోతులు పెట్టి తవ్వుతున్న మున్నేరు ఇసుకను పరిశీలించి అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పంటలపై దుమ్ము ధూళి

కన్నివేడు సమీపంలో ఫీల్డ్ లేబర్ సొసైటీ కింద 56 ఎకరాల 70 సెంట్లు భూమి ఉంది. ఆభూమిని



గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిలో బొబ్బర్లు, వేరుశనగ, పుచ్చకాయ, పత్తి ,మిరప తోట, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. వీరి పొలాలకు అనుకొని మట్టి రోడ్డు ఉండటంతో ఈ రోడ్డు గుంట ట్రాక్టర్లు లారీలు వెళ్లడంతో దుమ్ము లేచి పంటలపై పడటంతో దళిత రైతులు ఆందోళన చెందుతున్నారు పండిన పంట కూడా చేతికొచ్చే తరుణం లేకుండా పోయిందని, పంటలపై దుమ్ము ధూళి పడటంతో ఆక్సిజన్ అందక చెట్లు చనిపోతారని దళిత రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్‌ను నవీకరణ చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : 2010 నుంచి 2016 మధ్యకాలంలో ఆధార్ కార్డు పొందిన వారితో పాటు, ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి తమ ఆధార్ ను నవీకరణ (అప్ డేట్) చేసుకోవాలని కష్ణాజిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ప్రజలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ లో ఆయన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు.ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ఒకే దేశం ఒకే రేషన్ కార్డు కార్యక్రమం కింద లబ్ధిదారులు దేశంలో ఎక్కడి నుండైనా రేషన్ పొందే అవకాశంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమఅభివద్ధి పథకాలు, పౌర సేవలను పొందాలనుకునేవారు ఆధార్ అప్ డేట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. వివిధ ఉద్యోగాల దరఖాస్తులు బ్యాంకు ఖాతాలు, ధ్రువపత్రాలు పొందేందుకు, స్థలాల రిజిస్ట్రేషన్, సిమ్ కార్డు తీసుకునేందుకు, రేషన్ కార్డు పొందడం వంటి పలు సేవలు సులభంగా పొందాలంటే ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆధార్ ఆధారంగా బ్యాంక్ ఖాతా తో పాటు దాదాపు 1000 ప్రభుత్వ పథకాల నివాసితులు లబ్ధి పొందవచ్చన్నారు. ఆధార్ ఉపయోగించి మొబైల్ సిమ్ పొందడమే కాకుండా వివిధ స్కాలర్షిప్ పథకాలకు మెరుగైన సౌలభ్యం పొందవచ్చన్నారు. తప్పిపోయిన కుటుంబ సభ్యులను ఆధార్ సహాయంతో తిరిగి వారి కుటుంబాలతో కలపడం సాధ్యమవుతుందన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపు దారులైతే వారు ఐటీ రిటర్న్ లను సులభంగా ఈ– వెరిఫై చేయవచ్చన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్డు వివరాలు పునరుద్ధరించుకోవాలని కలెక్టర్ అన్నారు. పుట్టిన పిల్లలకు ఆధార్ పొందేలా ఆస్పత్రుల్లోనే చర్యలు చేపడుతున్నట్లు, అన్ని ప్రభుత్వ ప్రవేట్ ఆసుపత్రుల్లో ఈ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 15 సంవత్సరాల లోపు పిల్లలకు రెండు సార్లు ఆధార్ అప్ డేట్ చేసుకునే



అవకాశం ఉందన్నారు. ఆధార్ అప్ డేట్ కు సంబంధించిన ఫిర్యాదులు, ముఖ్య సమాచారం, వివరాలు కోరకు టోల్ ఫ్రీ నెంబర్ 1947, help@uidai.gov.in వెబ్ సైట్ ను వినియో గించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జిల్లా ఎస్పీ పి జాషువా, డి ఎల్ డి ఓ సుబ్బారావు, ఆధార్ నమోదు డిస్టిక్ కో– ఆర్డినేటర్ లక్ష్మణ్, డి ఎం హెచ్ ఓ జి.గీతాబాయ్, డీఈవో తాహెరా సుల్తానా, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ ఇడిగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : కృష్ణాజిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘ కార్య నిర్వాహక సంచాలకులుగా అద్దంకి శ్రీనివాసరావు బుధవారం బాధ్య తలు చేపట్టారు. పంచాయతీరాజ్ కమిషనరేట్లో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస రావు ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది తహశీల్దార్ లకు డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతి కల్పించింది. ఈ నేపథ్యంలో తహశిల్దార్ కేడర్లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును కష్ణాజిల్లా బీసీ కార్పొరేషన్ ఈడిగా నియమిస్తూ గత నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ దుర్గ ఈ శాఖకు ఇన్చార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలను చేరే విధంగా కషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.బాధ్యతలు చేపట్టిన ఆయన్ని కార్యాలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు.




శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : రక్తదానం ప్రాణ దానం సమానమని కృష్ణాజిల్లా ప్రజారవాణా అధికారి జి. నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్టీసి డిస్పెన్సరీలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజా రవాణాశాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తులకు, రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే కొరకు బ్లడ్ డొనేషన్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకొవటానికి ముందుకు వచ్చిన ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులందరికీ కతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు, బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికుల నుండి 74 యూనిట్లు రక్త సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ విజయ్ సింగ్, ఆర్టీసి డిప్యో మేనేజర్ పెద్దిరాజు, రెడ్ క్రాస్ ట్రెజరర్ కె. రామ్ బాలాజీ, రెడ్ క్రాస్ డాక్టర్ శివప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ద్విచక్రవాహనాలు అందజేత

ప్రజాశక్తి కోడూరు : ఆంధ్రప్రదేశ్ మత్స్య శాఖ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకము ద్వారా లబ్ధిదారులకు ద్విచక్ర వాహనాలు, ఐస్ బాక్స్‌లను కోడూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ మత్స్యకారులకు కోడూరు మండలం వ్యాప్తంగా రూ.9,75,000 విలువగల సామాగ్రి అందజేసినట్లు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్ళినప్పుడు ఉపయోగించు కోవడంతోపాటు మత్స్యకారులకు జీవనాధారమైన మత్స్య సంపదను అమ్ముకోవడానికి ఈ ద్విచక్ర వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. త్వరలో మత్స్యకారులకు ఆటోలు కూడా ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ



ద్విచక్రవాహనాల అందిస్తున్న ఎంఎల్ఎ

పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్న షైనీ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితులు

గన్నవరం సిఐగా కనకారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పోలీస్ స్టేషన్ సీఐగా పి.కనకారావు బుధవారం బాద్యతలు చేపట్టారు. గతంలో ఇదే స్టేషన్‌లో 2006 నుండి 2009 వరకు ఎస్ఐ గా ఈయన పని చేసారు. మంచి వ్యక్తిత్వం తో పాటు అందరిని కలుపుకు పోయే గుణం కలిగిన వ్యక్తి అనే నానుడి వుంది. అంతేకాకుండా వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ వేత్తలలోనూ, డిపార్ట్ మెంట్ లోనూ మంచి అధికారిగా పేరు కూడా ఉంది. సీఐగా పదోన్నతి వచ్చిన తర్వాత జిల్లాలో



పలుచోట్ల పనిచేసే సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం గన్నవరం బదిలీపై వచ్చారు. పొలిటికల్ సెన్సిటివ్ స్టేషన్ గా గన్నవరానికి ముద్ర పడింది. రాజకీయ నాయకుల మాట వినకుంటే తల నొప్పులు కొని తెచ్చుకున్నట్టే. ఇటీవల కాలంలో పేకాట కేంద్రాలకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలతో అధికారులపై వేటు పడిన సందర్భాలూ లేకపోలేదు. ఇక్కడ పనిచేసిన సీఐ శివాజీ పొలిటికల్ ఒత్తిడి వల్లే బదిలీపై వెళ్లారు.

న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : ఉంగుటూరు మండలం ఆత్కూరు సొసైటీ బ్యాంక్ బాధితులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ టెంట్ వేసుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ చిన్నసన్నకారు, కూలి నాలీ చేసుకొని జీవించే తాము దాచుకున్న డబ్బులు సుమారు నాలుగు కోట్లు సొసైటీ బ్యాంక్ అధికారులు గోల్‌మాల్ చేశారని చెప్పారు. బ్యాంక్ అధికారులు దిగివచ్చే వరకు కదలబోమని, న్యాయం చేయాలని నినాదాలు చేసారు.

కలెక్టర్‌ను కలిసిన విశ్రాంత ఐఎఎస్ బృందం

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : విశ్రాంత ఐఏఎస్ అధికారిణి రష్మీశర్మతో పాటు పలువురు బృంద సభ్యులు బుధవారం కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై చర్చించడంతో పాటు సలహాలు, సూచనలు ఆమె అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ పనితీరుపై ఆమె సంతప్తి వ్యక్తపరిచారు.డ్వామా పీడీ జివి. సూర్యనారాయణ, డిఎల్డీఓ డి. సుబ్బారావు తదితరులు కలెక్టర్ తో పాటు ఉన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బంటుమిల్లి

అనుగ్రహ దష్టిదాన్ వారి సంయుక్తంతో ఒఎన్‌జిసి రాజమండ్రి అసిస్ట్ వారి ఆధ్వర్యంలో బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల ప్రజలకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. సుమారు 208 మందికి నేత్ర పరీక్ష నిర్వహించగా అందులో 15 మందికి ఆపరేషన్లు నిర్వహించనున్నారని, అదేవిధంగా 107 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి డిజిఎం హెచ్ఆర్ ఎం. శ్రీనివాస్,జె.ప్రసాదరావు, చాగంటి ఉమానాయుడు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చాగంటి మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలోని అన్ని గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా సరిపడా పనులు గుర్తించ డానికి గ్రామసభలు జరిపి అందరికి పనులు చూపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుడ్లవల్లేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో దారపు శ్రీనివాస్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు మామిడి బాబూరావు, జిల్లా నాయకులు బి.వి.శ్రీనివాసరావు, మండల ప్రజాసంఘాల నాయకులు పెయ్యాల సురేష్,కళ్లెవరపు రంగారావు, అన్వర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.





నగదు అందిస్తున్న దృశ్యం

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని వడ్లమన్నాడు శివారు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పామర్తి రమేష్ మృతిచెందగా వైయస్సార్ బీమా తక్షణ సహాయం కింద పదివేల రూపాయలు నగదును బుధవారం మతుని భార్య రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ జి రాంబాబు. పిన్నేరు ప్రభాకర్ రావు, పంచాయతీ సభ్యులు పామర్తి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు,

మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది, బుధవారం గన్నవరం పిఎసిఎస్ఆర్‌బికే మర్లపాలెం పరిధిలోని బందావనంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ ను బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎ మ్‌సి చైర్ పర్సన్ రామిశెట్టి అంజనీ కుమారి, వైస్ చైర్ పర్సన్ నాగనబోయిన బలమధుర్‌శ్రీ, పసుపులేటి మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు మార్చిలోగా చెల్లిస్తాం

సర్పంచ్‌లకు డిప్యూటీ సిఎం ముత్యాలనాయుడు హామీ

ప్రజాశక్తి-విజయవాడరూరల్: గ్రామ పంచాయతీలకు వివిధ భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను మార్చి నెలాఖరులోగా మంజూరు చేస్తామని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బి.ముత్యాలనాయుడు గ్రామ సర్పంచ్‌లకు హామీ ఇచ్చారు. వైసిపి మద్దతుతో ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రప్రదేశ్ సర్పంచుల ఐక్య వేదిక' పేరుతో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. వేదిక తొలి సమావేశం బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి గన్నవరం నియోజకవర్గ ప్రతినిధిగా విజయవాడ రూరల్‌లోని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలు, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఏపీ సర్పంచుల ఐక్యవేదిక నాయకులు మంత్రికి వినతిపత్రం అందించినట్లు రంగారావు తెలిపారు. సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కాజా లక్ష్మీనారాయణ మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల: భవన నిర్మాణ కార్మికులకు ఆదర్శప్రాయంగా నిలిచిన కాజా లక్ష్మీనారాయణ (గుంటూరు మేస్త్రి) బుధవారం సాయంత్రం మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీనారాయణ (89) స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా భవన



నిర్మాణ రంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. వందలాది మందికి పని నేర్పి ఉపాధి కల్పించడమే కాకుండా, ఆయన వద్ద ఎందరో మేస్త్రిలుగా తర్ఫీదు పొందారు. ఆయన వద్ద పనిచేసిన చాలామంది పలు ప్రాంతాల్లో బిల్డర్లుగా స్థిరపడ్డారు. సుమారు 60 సంవత్సరాల క్రితం గుంటూరు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ఆయన గుంటూరు మేస్త్రిగా పేరు తెచ్చుకున్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌కు సైతం ఆయన ఎనలేని సేవలందించారు. ఆయన మృతి పట్ల భవన నిర్మాణ కార్మికులు సంతాపం తెలిపారు.

మునకుళ్లలో పొలంబడి

ప్రజాశక్తి-తిరువూరు: మేలైన వ్యవసాయ పద్ధతులలో భాగంగా మండలంలోని మునకుళ్లలో బుధ వారం పొలంబడి నిర్వహించారు. మా స్టర్ ట్రైనర్, రెడ్డిగూడెం వ్యవసాయాధి కారి సురేష్ పత్తి పంటలో లింగాకర్షణ బుట్టలు, పక్షిస్థావరాల ఉపయోగాలు రైతులకు వివరించారు. ఈసందర్భంగా వసాయ అధికారిణి పద్మ మాట్లా డుతూ ఎకరానికి నిఘా కొరకు నాలుగు లింగాకర్షణ బుట్టలు పెట్టుకొని కాండం తొలుచు పురుగు, తల్లి రెక్కల పురుగు ఉధతిని గమనిస్తూ ఉండా లని, ఆర్థిక నష్ట పరిమితి స్థాయి (1చద రపు మీటరుకు ఒక తల్లి రెక్కల పురు గు లేదా గుడ్ల సముదాయం పిలక దశ లో 5 శాతం చనిపోయిన మొవ్వులు) దాటినపుడు, మిత్ర పురుగుల నిష్పత్తి శత్రు పురుగుల కంటే తక్కువగా ఉన్న పుడు మాత్రమే పురుగు మందులు వినియోగించాలన్నారు. బృంద విన్యాసాల ద్వారా జట్టులోని సభ్యులు పరస్పర సహకారంతో ఒక పనిని విజయవంతంగా ఎలా పూర్తి చేయవచ్చు అనేది రైతులకు ప్రాక్టికల్‌గా చూపించారు.

పాత మస్టర్ విధానాన్నే కొనసాగించాలి

ప్రజాశక్తి-విజయవాడ: మునిసిపల్ కార్మికులకు ఇబ్బందికరంగా తయారయిన ఫేస్ ఆధారిత మస్టర్ విధానాన్ని ఎత్తివేసి పాత పద్ధతినే



కొనసాగించాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఫేస్ ఆధారిత మస్టర్ విధానాన్ని ఎత్తివేయాలని, ఆదివారం ఫుల్ డే సెలవు మంజూరు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, అధికారుల వేధింపులు నిలుపుదల చేయాలని కార్మికులు నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాసు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి ప్రవీణ్, ధనికొండ వెంకటేశ్వరరావు, పి మహేష్‌బాబు, ఎన్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణకు

రేపు యుటిఎఫ్ సంకల్ప దీక్ష

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పాత పెన్షన్ పునరుద్దరించాలని కోరుతూ ఈ నెల 3వ తేదీన యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సంకల్ప దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం గన్నవరం ధర్నాస్థలి వద్ద సంకల్ప దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఎస్ స్కీమ్ వల్ల ఉద్యోగుల జీవితాలు ఉద్యోగ విరమణ అనంతరం అగమ్య గోచరంగా మారతాయన్నారు. నేడు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో పాలక పక్షాలు సిపిఎస్ రద్దు చేస్తామని, ఓపియస్ పునరుద్దరణకు అడుగులు వేస్తున్నాయన్నారు. కానీ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి కూడా ఒక వారం రోజులలో రద్దు చేస్తానని పాదయాత్ర సమయంలో హామీనిచ్చినా నేటికీ నెరవేరలేదన్నారను. అంతేకాకుండా సిపిఎస్ బదులుగా జిపిఎస్ స్కీం ప్రవేశపెడతామంటున్నారన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య మాట్లాడుతూ 33 శాతం గ్యారంటీతో ఇచ్చే పెన్షన్ ఉపయోగం లేదని, జీపిఎస్ స్కీంలో ఇచ్చే హెల్త్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్, కనీస పెన్షన్ వంటి సౌకర్యాలు వల్ల ఉద్యోగికి పెద్ద ప్రయోజనాలు లేవన్నారు. పాత పెన్షన్ మాత్రమే కావాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు యం.శ్రీనివాసరావు, ఎం.రత్నకుమలబాబు, గోపాలకృష్ణ, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయలక్ష్మి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో వైసిపిని దోషిగా నిలబెడతాం

●విపక్షాల గొంతునొక్కేలా కౌన్సిల్ నిర్వహణ ●సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాశీనాథ్



మాట్లాడుతున్న కాశీనాథ్, చిత్రంలో సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ: అప్రజాస్వామిక పద్దతిలో, అత్యంత నిరంకుశంగా అధికార వైసిపి మంగళవారం విఎంసి కౌన్సిల్‌ను నిర్వహించిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ విమర్శించారు. స్థానిక శ్రీశ్రీ భవన్‌లో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అజెండాలో నగరాభివృద్ధి, నిధులు, ప్రజలకు సంబంధించిన అంశాలపై కనీస చర్చకు కూడా తావివ్వకుండా, విపక్ష సభ్యుల గొంతు నొక్కి ఏకపక్షంగా వందల అంశాలతో కూడిన అజెండాను నిమిషాల వ్యవధిలో ఆమోదించుకున్నారన్నారు. నగర వ్యాప్తంగా నాలుగు వేల మందికి నోటీసులు జారీ చేసి రెండు వేల పింఛన్లు తొలగించిన వాటిపై సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అజెండాలో ప్రత్యేక అంశంగా తీసుకొచ్చి మాట్లాడబోతుండగా ఆయనకు మద్దతునిచ్చిన టిడిపి సభ్యులను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. విపక్షాలను మాట్లాడనీయకుండా నోరు నొక్కడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కమ్యూనిస్టుల పాలనలో విజయవాడ నగర తొలి మేయర్‌గా పని చేసిన టి.వెంకటేశ్వరరావు వద్దకు అనేక మంది మేయర్లు, ఛైర్మన్లు పురపాలనపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ కోసం వచ్చే వారని తెలిపారు. ప్రస్తుత మేయర్ రాయన భాగ్యలక్ష్మీ తన స్వతంత్రను కోల్పోయి, ఎమ్మెల్యేల కనుసైగల నడుమ కౌన్సిల్‌ను అప్రజాస్వామిక, నియంతృత్వ పద్దతుల్లో నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఫుడ్‌కోర్టులో భారీ మొత్తంలో జరుగుతున్న అవినీతి అక్రమాల నేపధ్యంలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ వైసిపిని నిలదీయగా, ఆయనకు మద్దతుగా అధికారపక్షం సీనియర్ సభ్యులు బొల్లా విజయ్‌కుమార్ నిలిచి ఫుడ్‌కోర్టులో లక్షలు, కోట్లు చేతులు మారుతున్నాయని, పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, తాను రుజువు చేస్తానని కౌన్సిల్‌లో సవాల్ చేసినా వైసిపి మిన్నకుండి పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో అధికార వైసిపి దౌర్జన్యాలను తేల్చుకుంటామని హెచ్చరించారు. సత్యబాబు మాట్లాడుతూ కౌన్సిల్‌లో తన పట్ల అధికార వైసిపి దుర్మార్గంగా వ్యవహరించి, బలవంతంగా బయటకు గెంటేసిందని అన్నారు. అధికార పక్షం ఆగడాలను ప్రజలకు వివరించి, సమస్యల పరిష్కారానికి పోరాడతానన్నారు.



రెండో రోజూ నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గుణదల మాతగా పేరున్న మరియమాత ఆధ్యాత్మిక తల్లిగా నీరాజనాలు అందుకుంటుందని రీజనల్ సుపీరియర్ ఇండియా రెవరెంట్ ఫాదర్ మార్నెని రవితానయ్య అన్నారు. గుణదల మాత నవదిన మహోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు ప్రత్యేక ప్రార్థనలు గుణదల మేరిమాత పుణ్యక్షేత్రం వద్ద జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ మార్నెని రవితానయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఇతరులకు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫాదర్లు, విచారణ గురువులు పాల్గొన్నారు.

'పంటలు నమోదు చేయించుకోవాలి'

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలో రబి పంటలు సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయా ధికారి షేక్ టిప్పు సుల్తాన్ కోరారు. బుధవారం ఆయన చీమలపాడు లో బుచ్చిబాబుకు చెందిన మొక్కజొన్న పంట పొలాన్ని రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏ పంట సాగు చేస్తే ఆ పంటకు సంబంధించిన వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తో రైతు భరోసా కేంద్రాలలోసంప్రదించాలని కోరారు. పంట నమోదు చేయించుకున్న తర్వాత వెంటనే ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని అప్పుడు మాత్రమే పంట నమోదు (ఈక్రాప్) పూర్తి అయినట్లుగా తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 1384 మంది రైతులకు గాను, 3169 ఎకరాలలో పంట నమోదు పూర్తయిందని, ఇంకా ఎవరైనా రైతులు పంట నమోదు చేయించుకోకపోతే వెంటనే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి కంట నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు పంట కొనుగోలు, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా అన్నీ కూడా ఈ క్రాప్ తోనే ముడిపడి ఉన్నాయన్నారు. మండలంలో ఈ క్రాప్ నమోదు చేయించుకునే రైతులు ఈనెల 20 వరకు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ ఎ. రామచంద్రరావు, ఈ హెచ్ ఏ వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

వైసిపికి శివనాగేశ్వరావు రాజీనామా

ప్రజాశక్తి-నందిగామ: వైసిపి నందిగామ మండల అధ్యక్ష పదవికి శివనాగేశ్వరావు రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో సాధారణ కార్యకర్తగా కొనసాగుతానని చెప్పారు. ఇసుక వ్యవహారంలో దూషించిన వారికి క్షమాపణ చెప్పారు. ఇసుక రవాణాలో ప్రతిపక్షం వాళ్ళు మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడం వల్లనే అలా మాట్లాడాల్సి వచ్చిందన్నారు. అంబారుపేట గ్రాంపు నుంచి సచివాలయం భవన నిర్మాణ పనులకు మాత్రమే ఇసుకను తీసుకువెళ్లడం జరిగిందని, తన వ్యక్తిగత అవసరాలకు తీసుకువెళ్లలేదని తెలిపారు. అక్కడ జరిగిన ఉద్రిక్త పరిస్థితుల్లో ఆవేశంలో సిఎం జగన్‌పై నోరు జారినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ మహమ్మద్ మస్తాన్, గోనెల సీతారామయ్య, బండారు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణం 16వ వార్డులోని జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు నిడిగంటి నాగేశ్వరరావు ఇటీవల పలు



సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని జనసేన పార్టీ నాయకులు బుధవారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ తాటి వెంకటకృష్ణ, కామిశెట్టి వెంకటేశ్వరరావు, తాటి శివకృష్ణ, మేకపోతుల శ్రీ లక్ష్మి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యూహంలా కేంద్ర బడ్జెట్

ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ లింగమూర్తి

ప్రజాశక్తి-వన్‌టౌన్: కేంద్ర బడ్జెట్ పూర్తిగా ఎన్నికల వ్యూహంలా కనిపిస్తుందని ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ బీవీఎస్ లింగమూర్తి అన్నారు. కెబిఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజిమెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్-2023 అంశంపై చర్చా కార్యక్రమాన్ని బుధవారం ఈ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ త్వరలో జరిగే వివిధ రాష్ట్రాల ఎన్నికల నేపధ్యాన్ని గమనంలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు తెలుస్తోందన్నారు. మూలధన వ్యయాలకు సంబంధించి గతం కన్నా కొంచెం అధికంగా పెంచటం మంచి పరిణామమన్నారు. యువతకు సంబంధించి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను దేశ వ్యాప్తంగా 30 చోట్ల ఏర్పాటు చేయడం వల్ల మేలు కలిగే అవకాశముందన్నారు. గృహనిర్మాణం, గిరిజన అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపులు కూడా బాగానే ఉన్నాయన్నారు. అయితే కొన్ని వస్తువుల జీఎస్‌టీ రేట్లను తగ్గిస్తారని ఎదురుచూశామని అది కనిపించలేదన్నారు.కొన్ని రంగాలకు సంబంధించిన రాయితీలలో కూడా ఆశించిన స్పందన లేదన్నారు. మరో ఛార్టర్డ్ అకౌంటెంట్ జి.గంగాధర్ మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించిన పెంపు మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలకు ఊరటనిస్తుందన్నారు. కేటాయింపులు బాగున్నా వాస్తవ రూపంలో అవి అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డాక్టర్ ఆంజనేయశాస్త్రి పాల్గొన్నారు.



బివిఎన్ రాజబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

అన్ని రంగాల్లో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని పలువురు వక్తలు కొనియాడారు. మచిలీపట్నంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎ.జె.కె పారిశ్రామిక శిక్షణా సంస్థలో వివిధ హోదాల్లో పని చేసిన బి.వి.ఎన్.రాజబాబు, ప్రిన్సిపల్ (ఎఫ్ఎసి)గా ఉద్యోగ



రాజబాబును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

విరమణ పొందుతున్న సందర్భంగా బుధవారం ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గత 37 సంవత్సరాలుగా వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన రాజబాబు సహోద్యోగుల మన్ననలను పొందారన్నారు. వేలాది మంది విద్యార్థులను ఉన్నతమైన పౌరులుగా తీర్చి దిద్దడంలో ఆయన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్నా సంస్థ అభివృద్ధికి ఆయన సూచనలు, సలహాలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ముఖ్య అతిథిగా ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తోటి సిబ్బంది వి.భాస్కరరావు, కె.జె.ఆర్. శేఖరరావు, కె.వి.నారాయణ, పి.వెంకటలక్ష్మి, జి.రజనీకాంత్, వి.రాణి, విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

నేడు ప్రమాద రహిత డ్రైవర్లకు అభినందన సభ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

జిల్లావ్యాప్తంగా ఆర్టీసీలో సుదీర్ఘకాలం ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన వారికి గురువారం డిపో గ్యారేజీలో అభినందన సభ నిర్వహిస్తున్నట్లు మచిలీపట్నం డిపో మేనేజర్ టి.పెద్దిరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగింపు రోజుని పురస్కరించుకుని నిర్వహిస్తున్న అభినందన సభకు ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ పి.జాషువా, విశిష్ట అతిథిలుగా జిల్లా రవాణా అధికారి పి.సీతాపతి, ప్రజా రవాణాశాఖ అధికారి గద్దె నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు. జిల్లాలోని బస్సు డిపోల మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు సభకు హాజరు అవుతారని తెలిపారు.

వైభవంగా వీరమ్మ గ్రామోత్సవం

ప్రజాశక్తి-ఉయ్యూరు

వీరమ్మతల్లి తిరునాళ్లలో భాగంగా బుధవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. 15 రోజులపాటు ఈ తిరునాళ్ళ జరగనున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి రావిచెట్టు సెంటర్‌లోని మెట్టి నింటి నుండి బయలుదేరిన అమ్మవారు బుధవారం సాయంత్రం వరకు పట్టణంలో వీధి వీధి ఊరేగి భక్తుల ఎదురుగండ దీపాలు అందుకుని తిరుగుగండ గండదీపాల భక్తులు వెంటరాగా హారతులు, పసుపు కుంకుమ అందుకున్నారు. ఉపవాస దీక్షలో ఉన్న గండదీపాల భక్తులకు పలు సంస్థలు, వ్యక్తులు అల్పాహారం, పాలు, మజ్జిగ పంపిణీ చేశారు.



వీరమ్మ తిరునాళ్లకు హాజరైన యాత్రికులు




సభలో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

రైతాంగానికి అండగా నిలవండి

దివి ఎఎంసి ఛైర్మన్ కొక్కిలిగడ్డ ప్రమాణస్వీకారంలో సింహాద్రి

ప్రజాశక్తి-నాగాయలంక, కోడూరు

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అనునిత్యం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందనీ, సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి బాటలో నడిచి అన్నదాతలకు అండగా నిలవాలని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు బుధవారం ప్రమాణ స్వీకార చేశారు. కోడూరు మండలం పిట్టలంక గ్రామం నుంచి అవనిగడ్డ మీదుగా నాగాయలంక మార్కెట్ యార్డ్ వరకు భారీ ర్యాలీ జరిగింది. బాణాసంచాతో ఎంతో ఉత్సాహంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత దివి ఎఎంసి సెక్రటరీ కె.ఆనంద్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా పరిసే యేసయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పాటుగా మార్కెట్ యార్డ్‌లో 17 మందిని నూతన డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని నూతన కమిటీని కోరారు. ధనిక, పేద రైతు అనే తారతమ్యం లేకుండా అందరినీ సమానంగా చూస్తూ వారికి అండగా నిలవాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేశారన్నారు. రైతుల విషయంలోనే కాకుండా అన్ని తరగతుల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదేశాలమేరకు నమ్మకంతో పార్టీ కోసం అనుక్షణం కష్టపడుతున్నానన్నారు. తనకు గుర్తింపు ఇచ్చి ఎఎంసి ఛైర్మన్ పదవిని ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. రాజకీయ పార్టీలనే బేధం లేకుండా అందరినీ సమన్వయంగా చూస్తూ దివి ఎఎంసి అభివృద్ధికి నిరంతరం పాటు పడతానన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రేమాల బెనర్జీ, నాయకుడు మత్రి రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ నలకుర్తి రమేష్, నాగాయలంక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఎంపీపీ భోగాది రాఘవ రాణి, మండల ఎంపీటీసీలు, సర్పంచులు, అవనిగడ్డ, కోడూరు జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, దివి మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న రామలింగేశ్వరరావు

పిఎల్ఐ పాలసీదారులకు అత్యధిక బోనస్

అవనిగడ్డ హెడ్ పోస్ట్ మాస్టర్ రామలింగేశ్వరరావు


ప్రజాశక్తి-అవనిగడ్డ

దేశంలో బోనస్‌ను పాలసీదారులకు ఎక్కువగా ఇచ్చే అగ్రగామి సంస్థ తంతి తపాలా జీవిత బీమా సంస్థ అని అని అవనిగడ్డ హెడ్ పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు తెలిపారు. పోస్టల్ జీవిత బీమా సంస్థ ఏర్పడి బుధవారానికి 140 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పోస్టల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను మొదట బ్రిటీష్ ఇండియా 1884లో తంతి తపాలా ఉద్యోగుల కోసం లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రారంభించిందన్నారు. ప్రపంచంలో చాలా సంస్థలు భీమాను మహిళలకు ఇవ్వని రోజుల్లో వర్తింప చేయడం ఒక ప్రత్యేకతగా పేర్కొన్నారు. మొదట్లో ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే భీమా వర్తింప చేసేవారని అనంతరం డిగ్రీ చదివిన వారందరికీ బీమా అవకాశం కల్పించారన్నారు. గ్రామీణ ప్రాంతాలు దేశానికి పట్టుకొమ్మలు కాబట్టి చదువుతో సంబంధం లేకుండా అందరికీ జీవిత బీమా ఇచ్చే విధంగా అవకాశం కల్పిస్తున్నాయని వివరించారు. తంతి తపాలా బీమా సంస్థ దేశంలోనే అన్ని సంస్థల కంటే అత్యధిక బోనస్ కూడా అందజేస్తోందన్నారు. ఘంటసాల మండలం పాప వినాశనం గ్రామానికి చెందిన ఓ మహిళ జీవిత బీమా కడుతూ మరణించగా ఆమె భర్త దొక్కు సాంబశివరావుకు అప్లికేషన్ అందిన రెండు రోజుల్లోనే డెత్ క్లెయిమ్‌ను అవనిగడ్డ హెడ్ పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోస్ట్ మాస్టర్ కె.రంగమ్మ, రంగనాయకులు, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల ఎఎంసి ఛైర్మన్ గా వేమూరి వెంకట్రావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్‌గా వేమూరి వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొడాలిలోని ఏఎంసీ కార్యాలయంలో ఆయన, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేమూరి వెంకట్రావు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రైతు శ్రేయస్సుకై




వేమూరి వెంకట్రావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఎంఎసి సిబ్బంది

నిరంతరం తపిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు తుమ్మల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్లు వేమూరి రత్నశేఖర్, తాతినేని వెంకట కృష్ణారావు, ఘంటసాల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుంపటి శరత్, దోనేపూడి వీరరాఘవేంద్రరావు, పైడిపాముల అశోక్, పైడిపాముల ఆనంద్, మూల్పూరి వెంకయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.వెంకట సుబ్బారావు, మొవ్వ ఏడిఏ శ్యామల, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.నాగమణి తదితరులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా సుశీల

ప్రజాశక్తి-గన్నవరం

మండల మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా దావాజిగూడెం గ్రామానికి చెందిన దేవరపల్లి సుశీల ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కేసరపల్లికి చెందిన



సుశీలను సత్కరిస్తున్న ఎంపిపి అనగాని రవి తదితరులు

కె.స్వరూప, ఉపాధ్యక్షురాలిగా కొండపావులూరుకు చెందిన కూచిపూడి ఝాన్సీరాణి, కోశాధికారిగా అల్లాపురానికి చెందిన వన్నెం సామ్రాజ్యం, సంయుక్త కార్యదర్శిగా గన్నవరానికి చెందిన రిజ్వానా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీపీ అనగాని రవి, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏపీఎం మాధవి అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, డ్వాక్రా రుణ సదుపాయాలను అర్హులైన మహిళలందరూ సద్వినియోగం చేసుకునే విధంగా నూతన కార్యవర్గం కృషి చేయాలని ఎంపీపీ ఆకాంక్షించారు. బుద్దవరం ఉప సర్పంచ్ వి. వి.బసవరావు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ఉయ్యూరు : వీరమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర కూరగాయల వ్యాపారం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఉయ్యూరు మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు బుధవారం ఆవిష్కరించారు. స్థానిక మార్కెట్ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రైతు లేనిదే రాజ్యం లేదని, రైతే రాజన్న మాటలు నేడు ఎండ మావులుగా మారాయన్నారు. ఐక్యమత్యంతో ఏదైన సాధించొచ్చన్నారు. కొనబోతే కొరివి అమ్మబోతే అడవి చందాన నేడు రైతు పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు.

'ఠాగూర్'కు రూ.2.40 లక్షల విలువైన 'సంకెళ్లను తెంచుకుంటూ' పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - విజయవాడ : గ్రంధాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, పౌర గ్రంధాలయ శాఖ డైరెక్టర్ ఎం.ఆర్.ప్రసన్న కుమార్ కషితో రాష్ట్ర గ్రంధాలయాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు రచించిన 'సంకెళ్లను తెంచుకుంటూ' తెలుగు, ఇంగీషు పుస్తకాలను బుధవారం కష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ టి.జమల పూర్ణమ్మకు గోసాల సేవ ట్రస్ట్ చైర్మన్ జి.మురళీ కష్ణ బవహూకరించారు. రూ.2.40 లక్షల విలువైన 1000 పుస్తకాలను ఆయన బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది డి.రమేష్, కే.రాంబాబు, కుమార్ పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ టి.జమల పూర్ణమ్మకు పుస్తకాలను బహూకరిసుతన్న గోసాల సేవ ట్రస్ట్ చైర్మన్ జి.మురళీకృష్ణ

నర్సింగ్ కళాశాల మంజూరు హర్షణీయం : ఎంపి బాలశౌరి

(మొదటి పేజీ తరువాయి)

అందుతాయి. రాష్ట్రంలోని ఎంపిలంతా సంబంధిత కేంద్రమంత్రిని కలిసి రొయ్యల రైతుల కష్టాలను వివరించాము. దీంతో బడ్జెట్‌లో రొయ్యల మేతపై దిగుమతి సుంకం గణనీయంగా తగ్గించారు. ఇది ఆక్వా రైతులకు కొంతర ఊరటనిస్తుంది. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించడంతో మత్స్యకారులు ఎక్కువగా ఉన్న బందరు ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే రైతులకు సంబంధించి ప్రభుత్వ పథకాలు గణనీయంగా తగ్గించటం, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులలో త్వరగా పాడైపోయే పంటలకు సహాయపడే పథకాలను పూర్తిగా విస్మరించడం శోచనీయం.(ప్రవి)

ఉపాధి హామీ నిధుల్లో కోత : వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు మురాల రాజేష్, కోట కళ్యాణ్

సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపి కార్పొరేట్లకు రాయితీలు కట్టబెట్టేలా కేంద్ర బడ్జెట్ ఉంది. గతంలో ఉపాధి హామీ చట్టానికి రూ.97 వేల కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దీని ద్వారా వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గిపోతాయి. అలాగే గత బడ్జెట్లో దళితుల సంక్షేమానికి రూ.1819.52 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.976.86 కోట్లు మాత్రమే కేటాయించారు. అలాగే ఆహార భద్రతకు గత బడ్జెట్లో రూ.2.27 లక్షల కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.1.97 లక్షల కోట్లకు కుదించారు.

ప్రజలకు మేలే చేసే బడ్జెట్ కాదు : సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు

కేంద్ర బడ్జెట్ వల్ల రాష్ట్రానికి, ఈ ప్రాంతానికి ఎటువంటి మేలు జరగకపోగా, రాష్ట్ర ప్రజలకు ఎటువంటి మేలు జరగదు. కేంద్రం మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేసింది. ధరల నియంత్రణకుగానీ, మహిళా సాధికారితకుగానీ నిధుల ప్రస్తావన లేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్రం నిరుద్యోగులకు ఎటువంటి కేటాయింపులు లేవు.

బడ్జెట్ అందరికీ ఉపయోగకరంగా ఉంది : ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ జి.శ్రీనివాసరావు

కేంద్ర బడ్జెట్ అందరికీ ఉపయోగకరంగా ఉంది. ఆదాయపు పన్నుకు సంబంధించి చక్కని శ్లాబ్‌లు అందించారు. పొదుపు చేసే అవకాశం తక్కువగా ఉన్నా నేరుగా పన్ను కట్టే విధానం ప్రవేశపెట్టారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించారు. ముఖ్యంగా ఆడపిల్లలకు సంబంధించి ప్రత్యేక పథకం ప్రవేశపెట్టారు.

అన్ని వర్గాల వారికి చక్కని బడ్జెట్ : ప్రముఖ విద్యావేత్త, రోడ్ సేఫ్టీ జిల్లా అధ్యక్షులు బి.రామమోహనరావు

బడ్జెట్ పేద, మధ్య తరగతి, వ్యవసాయదారులు, మహిళల జీవన విధానం మెరుగుపరచేవిధంగా ఉంది. రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా కొన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. కాలుష్య రహితంగా ఉండేందుకు వెహికల్ స్క్రాప్ పాలసీని తీసుకురావడం హర్షణీయం.

IN THE COURT OF 1st ADDL., JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. NO. 1224/2019

Between:-
Anand Enterprises, Rep.by its GPA Holder, Saripalli Venkata Subba Reddy
...**Plaintiff**
And
Boora Anil ..**Defendant**
To,
Defendant:-
Boora Anil S/o. Narasimha Rao, Resident of Flat No.402, Florance Apartments, Beside Kamineni Hospital, 100 Feet Road, Tadigadapa, Vijayawada, Krishna District-521137, Cell No: 8008222467.

Please take notice that the above suit is Posted to 23-02-2023 for your appearance and so that all of you are summoned to appear before the court on that day at 10.30 A.M., Else the suit will be decided in your absence.
Court Adjournment Date: 23-02-2023
Vijayawada
Dt. 30-01-2023

Bevara Atchuteswar,
Gundu Gangadhar,
Advocates for Plaintiff.

IN THE COURT OF IV ADDL., JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. NO. 639/2020

BETWEEN:
SYNDICATE BANK NOW CANARA BANK, NIDAMANURU BRANCH VIJAYAWADA, REPTD. BY ITS BRANCH MANAGER
...**PLAINTIFF**
AND
RACHAMALLU VENKATA SAI RAM AND ANOTHER ...**DEFENDANTS**
1st Defendant:- Rachamallu Venkata Sai Ram S/o. Surya Rao, residing at Flat No. 208, Kaveri Block, PS Towers, Bhavanipuram, Vijayawada.
2nd Defendant: Rachamallu Surya Rao. S/o. Krishna, residing at Flat no.208, Kaveri Block, PS Towers, Bhavanipuram, Vijayawada.

Please take Summons that the above suit is filed against you and the same is posted on 09-03-2023 for your appearance.

Therefore you are hereby directed to appear on 09-03-2023 at 10.30AM,.either in person or through your Advocate before the Honourable Court and in default the matter will be decided exparte.

(BY ORDER OF THE HONOURABLE COURT)

MD.HAYAD B.Com., B.L.,
Advocate
41-9-18, L.R.K.Towers,
SF-2, 2nd Floor,
Ramalayam Street, Naidupeta,
Krishnalanka, Vijayawada-13.

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ నిరాశే

లింకు రైలు మార్గం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాలు గుర్తించాయి. కాకినాడ - కోటిపల్లి - అమలాపురం - రాజోలు - నరసాపురం మీదుగా మచిలీపట్నం -రేపల్లె నుంచి నిజాంపట్నం - బాపట్ల వరకు లింకు రైలు మార్గం ఏర్పాటైతే మచిలీపట్నం అత్యంత ప్రధానమైన జంక్షన్‌గా ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది. నరసాపురం నుంచి బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం వరకు 74 కిలోమీటర్ల మేర లింకు రైలు మార్గం నిర్మాణానికి రూ.1540.62 కోట్లు, మచిలీపట్నం నుంచి రేపల్లె వరకు 45 కిలోమీటర్లకు రూ.1151.63 కోట్లు, రేపల్లె నుంచి నిజాంపట్నం మీదుగా బాపట్ల వరకు 45.81 కిలోమీటర్లకు రూ.792.33 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. మొత్తంగా నరసాపురం నుంచి మచిలీపట్నం మీదుగా బాపట్ల వరకు 164.84 కిలోమీటర్ల కోస్తా లింకు రైలు మార్గం నిర్మాణానికి రూ. 3484.58 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఆరేళ్ల క్రితం ఈ అంచనాలు వేసినా కేంద్ర బడ్జెట్లో ఈసారి కూడా మొండి చేయి చూపారు. ప్రస్తుతం పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకుంటే ఈ వ్యయం మరింత పెరుగుతుంది. రైలు నీరు ప్రాజెక్టులో భాగంగా విజయవాడ డివిజన్లో రూ.15 కోట్లతో వాటర్ బాట్లింగ్ ప్లాంటును ఏర్పాటు చేస్తామని కేంద్రం చెప్పింది. ఈనేపథ్యంలోనే బాపులపాడు మండలం మల్లవల్లి మోడల్ ఇండస్ట్రీయల్ పార్కులో దీని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. అయితే స్థలం కేటాయించి ఆరేళ్లవుతున్నా ప్రాజెక్టు ఏర్పాటుకు ఈసారి కూడా నిధులు కేటాయించలేదు. విజయవాడ -కొండపల్లి-కాజీపేట డబ్లింగ్‌కు, విజయవాడ - గుంటూరు - అమరావతి, రాజధాని అమరావతికి నూతన రైలు మార్గం ఏర్పాటుకు సంబంధించి కూడా కేంద్రం నిధులు కేటాయించకుండా ప్రజలను మోసం చేసింది. పర్యాటక కేంద్రాలైన హంసలదీవి, మంగినపూడి బీచ్‌లకు కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకు వస్తామని ఎంపి బాలశౌరి ప్రకటించినా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేవు. ఈనేపథ్యంలో అబివృద్ధి పేరుతో రెండు బీచ్‌ల్లో భారీ విస్తీర్ణంలోని భూములను ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. బడ్జెట్‌లో వ్యవసాయానికి, ఉపాధి హామీ చట్టానికి నిధుల్లో కోత పెట్టింది. ఇప్పటికే ఉత్పత్తి ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న మూడు లక్షల మంది రైతులపై మరింత భారం పడనుంది. ఆక్వా సాగు విస్తరించడంతో వ్యవసాయ పనులు తగ్గి కూలీలు వలసలు వెళ్ళాల్సి వస్తోంది. ఉపాధి చట్టం నిధుల్లో కోత పెట్టడంతో వీరికి అంతో ఇంతో ఆసరాగా ఉంటున్న ఉపాధి పనుల్లోనూ కోత పడుతుంది. విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా హనుమాన్‌జంక్షన్, మచిలీపట్నం తదితర ప్రాంతాల వృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆత్మనిర్భర భారత్‌లో చేనేత వర్గాలకు లబ్ధి చేకూరినట్లు బడ్జెట్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘనంగా ప్రకటించారు. అయితే బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన మార్కెటింగ్ ఇన్సెంటివ్‌లను నిలిపివేసింది. జిల్లాలో 36 సొసైటీలకు కోట్లాది రూపాయలు రావాల్సి ఉంది. దీనికితోడు జిఎస్‌టి విధించడంతో చేనేత వృత్తి భారంగా మారింది.

ఎండుతున్న వరి

వసూలు చేసి పనులను పర్యవేక్షిస్తున్నారు.

సకాలంలో నీటి సరఫరా లేకే..

మరోవైపు రబీ సీజన్‌లో సాగునీరు అందకపోవడంతో కొందరు రైతులు ఆలస్యంగా వరిసాగు చేశారు. ఆ వరి పొలాలు ఎండిపోవడంతోపాటు కొన్ని మొక్కలు చనిపోయాయి. సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని కొత్తూరు తాడేపల్లికి చెందిన కౌలు రైతు ఉప్పలపాటి వెంకటరావు తెలిపారు. "ప్రతి రైతు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశాడు. పంటలు చనిపోతే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతాం. మళ్లీ నాట్లు వేసే అవకాశం లేదు" అని ఆయన అన్నారు. మరో రైతు రాజులపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద గ్రామాల్లోని 1,500 ఎకరాల వరిపంటకు తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమే ప్రధాన ఆధారమన్నారు. ప్రతి ఏటా రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి సాగు చేస్తున్నారని, అయితే ఈ గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటలకు ఆస్కారం లేదని అన్నారు. ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా ఏడాది పొడవునా సాగునీరు అందించాలన్నారు. కొత్తూరు తాడేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు లక్కంరాజు పుండరీక వరద వర్మ (రాజు) మాట్లాడుతూ వరి పొలాలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు కషి చేస్తున్నామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌తో అనుసంధానమైన లోకల్ సప్లయ్ ఛానల్ పనులు రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బత్తిన రంగనాథ్ బాబును సంప్రదించగా, ఎగువ గ్రామల రైతులు నీటిని నిలిపి వేయడంతో కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద గ్రామాల్లో వెయ్యి ఎకరాల సాగుకు నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. సీజన్ ప్రారంభం కాకముందే రబీ సీజన్‌కు సాగునీరు సరఫరా చేయలేమని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అధికారులు రైతులకు చెప్పారని పేర్కొన్నారు. అయితే కొద్ది రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

బ్లాక్‌లో యూరియా!

ఆర్‌బికెల్లో ఎరువులు నిల్వ చేయడంలేదు. మొక్కజొన్న, కూరగాయలు, చెరకు తోటలకు అవసరమైన యూరియా కోసం రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. చల్లపల్లి, ఘంటసాల, కొడాలి, మోపిదేవి, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లోని కొందరు వ్యాపారులు కొరత ఉందని చెప్పి రూ.272కు విక్రయించాల్సిన యూరియాను రూ.335కు విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల రూ.500 వరకు విక్రయిస్తున్నట్లు బ్లాక్ మార్కెట్ దందాపై మోపిదేవి ప్రాంతానికి చెందిన కొందరు రైతలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో సంబంధిత అధికారులు ఉలిక్కిపడ్డారు. మోపిదేవి మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్బీకెలకు యూరియా నిల్వలు ఉంచేందుకు చర్యలు చేపట్టారు.

యూరియా బ్లాక్‌లో కొని నష్టపోవద్దు
మనోహరరావు, జిల్లా వ్యవసాయాధికారి

కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని బాపట్ల , గుంటూరు జిల్లాల్లో మొక్కజొన్న ఎక్కువగా సాగయింది. ఈ ప్రాంతాలకు సమీపంలో ఉన్న జిల్లాలోని మోపిదేవి , చల్లపల్లి, శ్రీకాకుళం, కొడాలి, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాల నుంచి ఎక్కువగా కొంటున్నారు. దీంతో సమస్య వచ్చినట్లు గుర్తించాం. సమస్య పరిష్కారానికి మోపిదేవి మండలంలో ఆర్బీకెలకు 40 టన్నుల యూరియాను పంపాం. జిల్లాలో 500 టన్నుల వరకు యూరియా నిల్వ ఉంది. మిగిలిన ప్రాంతాల్లోని ఆర్బీకెలకు పంపుతాం. రైతులెవరూ యూరియాను బ్లాక్‌లో కొని నష్టపోవద్దు.

IN THE COURT OF I ADDL., JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. NO. 1118/2020

BETWEEN:
CANARA BANK BUCKINGHAMPET BRANCH VIJAYAWADA, REPTD. BY ITS CHIEF MANAGER ...**PLAINTIFF**
AND
PILLA S.D. KIRAN KUMAR
PROP: SHANMUKH ENTERPRISES
...**DEFENDANTS**
Defendant:- Pilla S.D. Kiran Kumar S/o. P.K.Prasad, Prop: Shanmukha Enterprises, residing at Door No: 9-67-94, Kothapet, Vijayawada-1. Krishna District.

Please take Summons that the above suit is filed against you and the same is posted on 20-02-2023 for your appearance.

Therefore you are hereby directed to appear on 20-02-2023 at 10.30AM,.either in person or through your Advocate before the Honourable Court and in default the matter will be decided exparte.

(BY ORDER OF THE HONOURABLE COURT)

MD.HAYAD B.Com., B.L.,
Advocate
41-9-18, L.R.K.Towers,
SF-2, 2nd Floor,
Ramalayam Street, Naidupeta,
Krishnalanka, Vijayawada-13.

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సముఖమునకు
ఇ.పి.నెం.100/2022 ఇన్ ఒ.యస్.నెం.1431/2012

Polanki Sarveswara Kumar ...**DHR**
Vs
1. Pasam Sudha Rani Died
2. Pasam Hima Bindhu @Kalyani, D/o. Late Madhava Rao, Age 37 Years
3. Pasam Sirisha D/o. Late Madhava Rao, Hindu, age 35 Years, D.No: 26-4-42 A., Pinnalavari Street, Gandhinagaram, Vijayawada NTR Dt., ...**JDRS**

1st JDR (Original) చనిపోయినందున, వారి Death Benefits జప్తు చేయుటకు వారసులు అయిన కుమార్తెలపై దాఖలు చేసిన పై నెంబరులో ఆర్డర్ 21 ఆర్22 మరియు ఆర్ 46 నోటీసులు అమలు జరుగుటకు వాయిదా 24-02-2023 అయినందున వారసులు జేడిఆర్‌లు ఆక్షేపణలు వున్న యెడల వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి యెదుట హాజరై తెలియ పరుచుకోవలెను లేనిచో పరోక్షమందు విచారింపబడును.

॥పైకోర్టు వారి అనుమతితో॥

విజయవాడ
ది.29-01-2023

ఇట్లు
పదిలం రాజశేఖర్ B.Com, LLB.,
న్యాయవాది
#76-14-24 1B, 2nd Floor,
Near Gupta Cloth Show Room, Sai Tukaram Street, Swathi Theatre Road,
Bhavanipuram, Vijayawada - 520012.
Cell: 9885630209

గ్రామ పంచాయితీ కార్యాలయం - కలవపాముల

తేది: 01-02-2023

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కలవపాములగ్రామ పంచాయతీ పరిధిలోని SC కాలనీ నందలి సర్వే నెంబర్ 126 లో శిధిలావస్తులో ఉన్న రేడియో రూమును నిర్మూలన చేయుట తేది:01-02-2023ననుసరించి ఈ క్రింది తెలియ పరిచిన విధముగా ఈ దిగువ పేర్కొన్న శిధిలావస్థలో వున్న కలవపాముల గ్రామ పంచాయితీ కార్యాలయములో రేడియో రూమును నిర్మూలన చేయుట బహిరంగ వేలం ద్వారా విక్రయించుటకు గాను వేలం పాట ది.06-02-2023వ తేది సోమవారం ఉదయము:11.00 గలకు నుండి గ్రామ పంచాయితీ కార్యాలయములలో విస్తరణ అధికారి (పంచాయితీ రాజ్ గ్రామీణ అబివృద్ధి) ఉయ్యూరు మండలం వారి ఆద్వర్యములో నిర్వహించబడును. పాటదారులు నిర్ణిత ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను. టెండరు షరతులు వగైరా ఆఫీసు పనిచేయు వేశయందు తెలుసుకొనవలెయును.

వ.నెం.	పని వివరణ	ధరావత్తు
1.	కలవపాములగ్రామ పంచాయతీ పరిధిలోని SC కాలనీ నందలి సర్వే నెంబర్ 126 లో శిధిలావస్తులో ఉన్న రేడియో రూమును నిర్మూలన చేయుట	రూ1000/-

(సం) శ్రీ పొనుగుమాటి సుబ్రమణ్యేశ్వర రావు సర్పంచ్
గ్రామ పంచాయితీ కలవపాముల

(సం) శ్రీ టి. లక్ష్మణ రావు
పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ కలవపాముల

మట్టా జాన్‌విక్టర్ పుట్టినరోజు వేడుకలు

గుడివాడ : గుడివాడ రూరల్ మండల వైసిపి అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) స్వగృహంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి జాన్‌విక్టర్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని, గుడివాడ జెడ్పీటీసీ సభ్యుడు గొల్ల రామకృష్ణ, నందివాడ ఎంపీపీ పేయ్యల ఆదాం తదితరులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో విక్టర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నాగాయలంక : ఇండియన్ రెడ్ క్రాస్ నాగాయలంక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో స్థానిక చైల్డ్ రక్షా ప్రాజెక్ట్ పరిధిలోని అనాథ పిల్లలకు పాదరక్షలు, గుడ్లు, ఇతర పౌష్టికాహారాన్ని అందజేశారు. స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాన్ని అందజేశారు. శివవిష్ణువర్ధన్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యుడు పొన్నూరు భాను పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సహాయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రక్షా ప్రాజెక్ట్ సంస్థ నిర్వాహకులు ఎం.వెంకటేశ్వరరావు, వృద్ధాశ్రమం నిర్వాహకులు తలసిల లీలా మనోహర్, గుడివాడ శేషుబాబు, యర్రంశెట్టి నాగపవన్, చిట్టా శేఖర్, చిట్టా సాంబశివరావు, పిరాటి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి శంకుస్థాపన

మొవ్వ : మండల పరిధిలోని పెదముత్తేవి గ్రామంలో శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ అంగన్‌వాడీ తరగతి గది నిర్మాణానికి ఎంఎల్‌ఎ కైలే అనీల్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. మనబడి నాడు -నేడు ఫేజ్ -2 క్రింద మంజూరైన రూ.16 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న తరగతి గది నిర్మాణ పనుల భూమిపూజ,నామఫలకం ఆవిష్కరణ జరిగాయి. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా కళ్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక వీర బ్రహ్మేంద్రస్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం కళ్యాణ మూర్తుల గ్రామోత్సవం చల్లపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పురవీధుల్లో ఘనంగా జరిగింది. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళ్యాణ వేడుకలను ప్రారంభించారు. చల్లపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కమిటీ పెద్దలు ధ్వజ ప్రతిష్ట చేసి వేద పండితులు కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సంఘ నాయకులు శామీర్ పేట పేట సాయిబాబు, నడకుదురు లీల బ్రహ్మేంద్ర, కేశనకుర్తి శరత్, అడ్డాడ ప్రసాదు బాబు, డోలా శ్రీనివాసరావు, శామీరుపేట సుబ్బయ్య, అయ్యంకి నాగ బ్రహ్మచారి తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాల పనులకు శంకుస్థాపన

మొవ్వ : మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.05 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎంఎల్‌ఎ కైలే అనిల్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో నిడుమోలు జెడ్పీ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పైన పేర్కొన్న నిధులను మంజూరు చేసింది. బుధవారం ఈ మేరకు ఎంఎల్‌ఎ అనిల్ కుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులతో పాటు విద్యా కమిటీ ప్రతినిధులు పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే అభివృద్ధి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌భాష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

అభివద్ధిలో పరిశ్రమల పాత్ర ఎంతో కీలకమని, పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌భాష అన్నారు. తన ఛాంబర్‌లో బుధవారం ఆయన జిల్లాపరిశ్రమలు, ఎక్స్‌ఫోర్ట్ ప్రమోషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. రోడ్డు, జల రవాణాతోపాటు వాయు రవాణాతో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశమన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే ఔత్సాహికులకు రాయితీలు కల్పించడంతో పాటు సింగిల్ విండో పోర్టల్ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. వీరపనేనిగూడెం, చల్లపల్లి, మల్లవల్లి వంటి ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పారిశ్రామిక ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) ద్వారా రూ.50 లక్షల యూనిట్ కాస్ట్ తో 35 శాతం వరకు సబ్సిడీ ఇస్తామన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసంతో ట్రాన్స్పోర్టేషన్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలకు 45 శాతం ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీతో పాటు ఇతర రాయితీలు కల్పిస్తామన్నారు. క్లస్టర్లుగా ఏర్పాటు చేసుకునే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 95 శాతం గ్రాంట్‌తో రాయితీ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇస్తోందన్నారు. గత జనవరిలో 27 మంది దరఖాస్తుదారులకు రూ.1.28 కోట్లను మంజూరు చేశామన్నారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న బెల్ కంపెనీకి బందరు కాల్వ నుండి నీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కమిటీ దృష్టికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సింగిల్ విండో పద్ధతి ద్వారా వెంటనే పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావ్, ఏపీ ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.వరలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు : కొమ్మినేని

ప్రజాశక్తి-గన్నవరం

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గొల్లనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. పాఠశాల భౌతిక వనరులను జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి పథకాల వినియోగాన్ని లబ్ధిదారులైన విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిస్పందనను తెలుసుకున్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఈ సంవత్సరం ఇచ్చిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల వినియోగంపై వారి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. నాడు-నేడుతో పాఠశాలకు సమకూర్చబడిన భౌతిక వనరులను విద్యకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సంక్షేమ పథకాలను వినియోగించుకొని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. హర్ష ఫౌండేషన్ ద్వారా అకడమిక్ అచీవ్ మెంట్ ప్రోత్సాహకాలను అందజేశారు. బాలోత్సవంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని పనితీరుని అభినందిస్తూ వారిని దుశ్శాలువాతో సత్కరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రుచిగా ఉందని పిల్లలు చెప్పడంతో సంతోషించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎం.బాలగంగాధర్ తిలక్, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, స్రవంతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ కొమ్మినేని రామకృష్ణ, సాయి శ్రీనివాస ప్రిన్సిపల్ రాజులపాటి దుర్గారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గొలనపల్లి హైస్కూల్ హెచ్ఎం జగదీశ్వరరావు, శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

హంతకులను కాపాడుతున్న జగన్ : కొల్లు, కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జగన్‌కు బాబాయ్ హంతకులను కాపాడటంలో ఉన్న శ్రద్ధ ఈ రాష్ట్ర ప్రజలపై లేదని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు విమర్శించారు. బుధవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక 5వ డివిజన్‌లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ బాబాయ్ హంతకులను కాపాడేందుకు సుప్రీం కోర్టులో ఉన్న రాజధాని అంశాన్ని సిఎం జగన్ తెరమీదకు తెచ్చారన్నారు. విశాఖ రాజధాని అనే విషయాన్ని తెరమీదకు తెచ్చి డైవర్ట్ పాలిటిక్స్‌కు తెర లేపాడని విమర్శించారు. లిక్కర్ స్కాములో భార్య పేరు బయటకు రాగానే ఎన్టీఆర్ యూనివర్శిటీ పేరు తెరమీదకు తెచ్చారన్నారు. ఆ విషయాన్ని డైవర్ట్ చేసి ప్రజల దృష్టిని మళ్లించారన్నారు. నాడు రాజధానికి 30 వేలు ఎకరాలు కావాలని జగన్ కోరారన్నారు. ఇల్లు ఇక్కడే కట్టానని చెప్పి ఇప్పుడు రాజధాని విశాఖ అంటున్నాడన్నారు. ఇది మోసం కాదా? అని సిఎం జగన్‌ను వారు ప్రశ్నించారు. బాబాయ్ హత్య కేసులో సిబిఐ దూకుడు పెంచగానే జగన్ రెడ్డి పరిగెత్తుకుంటూ వెళ్లి ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడైనా ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు జరిపావా? చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి బాబా ప్రసాద్, పార్టీ పట్టణ కార్యదర్శి ఇలియాస్ పాషా, కార్పొరేటర్లు, పలువురు నగర కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇదేం ఖమ్మ ప్లకార్డును ప్రదర్శిస్తున్న కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు

ప్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యసేవలు

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి

ప్రజాశక్తి-పమిడిముక్కల


గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి నిరంతరం మెరుగైన వైద్యసేవలు అందించటానికి రాష్ట్రప్రభుత్వం నూతనంగా ఫ్యామిలీఫిజీషియన్‌ను ఏర్పాటుచేసిందని కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి గీతాభాయి అన్నారు. పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె సందర్శించారు. పిహెచ్‌సి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. గర్భిణీ స్త్రీలకు ప్రతి నెలా తొమ్మిదో తేదీన ప్రధానమంత్రి మాతృ యోజన పథకం ద్వారా శిశు సంరక్షణ కేంద్రం ద్వారా వైద్య పరీక్షలు చేసి లేకుండా మందులు ఎలా వాడాలో తెలియజేస్తారన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం రిపబ్లిక్‌డే రోజున మచిలీపట్నంలో కలెక్టర్ పి.రంజిత్‌భాష చేతులమీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న వీరంకిలాకు పిహెచ్‌సి వైద్యాధికారిణి పద్మను గీతాభాయి ప్రత్యేకంగా అభినందించారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఓ సుదర్శన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని వైద్య,ఆరోగ్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ ఎం శాస్త్రి, రమణ, పి హెచ్ ఎన్ ఝాన్సీ, వెంకట్రావు, సుబ్బారావు, కృష్ణమోహన్, వెంకటలక్ష్మి, నాంచారమ్మ, సుమలత, బుజ్జిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీతాభాయి

జగన్‌పై అక్కసుతోనే విమర్శలు : ఎంఎల్ఎ

మోపిదేవి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని అభాసుపాలు చేయడానికి ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు విమర్శించారు. మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామంలో బుధవారం ఉదయం సింహాద్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ఆ కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో వెను వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పంచాయతీ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరి ఆధ్వర్యంలో పిఎసిఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, మోపిదేవిలంక సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, పాల కేంద్రం అధ్యక్షులు పుప్పాల సతీష్‌బాబు, పిఎంసి చైర్మన్ గరికిపాటి సుబ్బారావు, వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, లింగం జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీష్మ ఏకాదశి పూజలు

అవనిగడ్డ : అవనిగడ్డలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు దివి నరసింహామూర్తి అధ్యక్షతన 40 మంది దంపతులు వ్రతాలు చేయగా వ్రత విశిష్టతను వివరించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులకు పూజా సామాగ్రిని ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఉచితంగా అందజేశారులయ ఈవో పి.సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, ఈ దిశగా పాలిటెక్నిక్ కళాశాలల్లో మెరుగైన క్రీడా వసతులు కల్పించామని రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివద్ధి మరియు శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ అన్నారు. విజయవాడ ప్రభుత్వ కళాశాలలో రాష్ట్రస్థాయి 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలైన 13 జిల్లాల్లోని పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 1600 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనున్నారని తెలిపారు. మూడు సంవత్సరాలుగా విద్య, సాంకేతిక విద్య, వృత్తి నైపుణ్యం శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టడం వల్ల నాణ్యతా ప్రమాణాలు పెరిగాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉపాధితో కూడిన విద్యా కోర్సులను ప్రవేశ పెట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తుందని అయన అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు, శారీరిక దారుఢ్యానికి విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలన్నారు. మూడు రోజుల పాటు అన్ని జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పించామని ఆమె అన్నారు. విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ను విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ముందుగా సౌరబ్ గౌర్, నాగరాణి, ఇతర అధికారులు క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించిన


పోటీలను ప్రారంభిస్తున్న నాగమణి

అనంతరం క్రీడాకారులకు క్రీడా జ్యోతిని అందించారు. క్రీడలు ప్రారంభ సూచికంగా పావురాళ్లను, బెలూన్‌లను ఎగురవేశారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు క్రీడా మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదో డివిజన్ కార్పొరేటర్ సిహెచ్.ఉషారాణి, సాంకేతిక విద్యా శాఖ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న అవికాగౌర్

ప్రేమ, హాస్య కథాంశంతో 'పాప్‌కార్న్'

- విజయవాడలో చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ప్రేమ కథాంశంతో పాటు హాస్య సన్నివేశాలతో పాప్‌కార్న్ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంటుందని హీరోయిన్ అవికాగోర్ అన్నారు. పాప్‌కార్న్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవికా గోర్ మాట్లాడుతూ యువతను చిత్రం ఎక్కువగా ఆకట్టుకుంటుందని, సినిమా ఎక్కువ భాగం ఒక లిఫ్టులో చిత్రీకరించినట్లు తెలిపారు. లిఫ్టులో జరిగే సన్నివేశాలు ప్రేక్షకులను నవ్విస్తాయన్నారు. దర్శకుడు మురళి మాట్లాడుతూ చిత్రంలోని ప్రతి సన్నివేశం ఆకట్టుకుంటుందని తెలిపారు. ఇప్పటికే పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ట్రైలర్, టీజర్‌కు మంచి స్పందన లభించిందన్నారు. హీరో సాయిరోనక్ మాట్లాడుతూ తాను నాలుగు చిత్రాల్లో హీరోగా నటించానని, తొలిసారిగా అవికాగోర్ లాంటి సీనియర్ హీరోయిన్‌తో నటించడం సంతోషంగా ఉందన్నారు. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. సమావేశంలో నిర్మాత చలపతిరాజు పలువురు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త వారికి 50 శాతం రాయితీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇ-కామర్స్ వ్యాపారంలో కొత్త వారికి 50 శాతం రాయితీని అందిస్తున్నట్లు అమెజార్ ప్రతినిధి రాజేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 15 నుండి ఏప్రియల్ 14వ తేదీ వరకు రిజిష్టర్ అయ్యే కొత్త విక్రేతలు అందరికీ 60 రోజుల వరకు రెఫరల్ ఫీజులలో 50 శాతం రాయితీ పొందుతారని తెలిపారు. దీని వల్ల విక్రేతలు అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యాపార రంగంలో రాణించేందుకు ఖర్చును ఆదా చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

పైపుల రోడ్డులో సిటీ బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-భవానీపురం: ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని జక్కంపూడి కాలనీ నుండి పైపుల రోడ్, డాబా కొట్లు సెంటర్, ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్, బిఆర్‌టియస్ రోడ్, గుణదల, కొత్త గవెర్నమెంట్ హాస్పిటల్, బెంజ్ కంపెనీ, పటమట మీదుగా ఆటోనగర్ వరకు వెళ్లడానికి నూతనంగా 33 జె నెంబర్‌తో నాలుగు బస్సులను ఏర్పాటు చేసినట్లు విద్యాధరపురం డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


సుబ్రహ్మణ్యేశ్వరరావు

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక 49వ డివిజన్‌లోని 167వ సచివాలయం పరిధిలో 180వ రోజు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం పర్యటించారు. ఒకటో తారీకు కావడంతో పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కొండ ప్రాంతంలో అందరికీ అన్నీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత వున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శ్రీనన్నదళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి గడపలోనూ సమస్యలే : సిపిఎం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బాబూరావు

ప్రజాశక్తి-సింగ్‌నగర్: పేదలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఏ గడపకు వెళ్లినా ప్రజలు పలు సమస్యలను విన్నవిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్ ఏకలవ్యనగర్‌లో గిరిజనులు, దళితులు నివసిస్తున్న ప్రాంతంలో బుధవారం సిపిఎం నాయకులు పర్యటించారు. స్థానికంగా నివసిస్తున్న ప్రజల సమస్యలు, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఎస్‌టి, ఎస్‌సిలు నివసిస్తున్న ప్రాంతంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్నా బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. వికలాంగులకు మెడికల్ సర్టిఫికెట్ ఇప్పించడానికి స్లాట్ కేటాయించడంలేదన్నారు. జగనన్న చేయూత పథకం కింద ఒక్క సంవత్సరం మాత్రమే డబ్బులు ఇచ్చారని, అర్జీ పెట్టుకున్నా రానివారు చాలామంది ఉన్నారని తెలిపారు. జగనన్న తోడు పథకం కింద రుణం పొందిన వారి దగ్గర భారీగా వడ్డీ వసూలు చేస్తున్నారని, బ్యాంకులో దాచుకున్న డబ్బులు అప్పు కింద జమ వేసుకుంటున్నారని చెప్పారు. మంచినీటి ఛార్జీలు రూ.15 వేలు కట్టాలని డిమాండ్ నోటీసులు ఇవ్వకుండా జప్తు నోటీసులు ఇస్తున్నారని, కనెక్షన్లు కట్ చేస్తున్నారని తెలిపారు. సామాన్య పేదలకు చెత్త, నీటి పన్నులు భారంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కె.కృష్ణమురారి, మూర్తి, కుంభా పుల్లయ్య, కూచిపూడి ఆందోని తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : సిఐ

ప్రజాశక్తి-భవానీపురం: వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, తద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవాలని భవానీపురం ట్రాఫిక్ సిఐ రామచంద్రరావు, లాఅండ్‌ఆర్డర్ సిఐ ఎం.డి.ఉమర్ తెలిపారు. భవానీపురం స్వాతి సెంటర్‌లో బుధవారం ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా వాహనంపై వచ్చేవారిని ఆపి వారికి గులాబీ పూలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భవానీపురం ఎస్‌ఐ రవీంద్రబాబు, మహిళా ఎస్‌ఐ అనూష, ట్రాఫిక్ ఎస్‌ఐ అర్జున్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్టినగర్ సెంటర్‌లో సిఐ సుబ్రహ్మణ్యం వాహనదారులకు అవగాహన కల్పించారు.



19న బిఎన్ఐ ఎపి నెట్వర్కింగ్ కన్‌క్లేవ్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్
ఈనెల 19న నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఏపీ నెట్వర్కింగ్ కన్‌క్లేవ్ నిర్వహిస్తున్నట్లు బీఎన్ఐ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలిపారు. బీఎన్ఐ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పరస్పర సహకారంతో వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహణకు సంకల్పించామన్నారు. ఏ రంగంలోనైనా నెట్వర్కింగ్ కీలక భూమిక పోషిస్తుందని, వ్యాపార రంగంలోనూ నెట్వర్కింగ్‌ను విస్తృతం చేయడం ద్వారా అద్భుత ఫలితాలను ఆవిష్కరించవచ్చని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన వారిని ఒక్కచోటికి చేర్చి, వారి నడుమ సుహృద్భావ సంబంధాలను నెలకొల్పి, తద్వారా విస్తత వ్యాపార అవకాశాలను సష్టించేందుకు బీఎన్ఐ ఏపీ కన్‌క్లేవ్ అద్భుతమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ సదస్సుకు వాణిజ్యవేత్తలు, వైద్య నిపుణులు, ప్రతిష్టాత్మక సంస్థల్లోని ఉన్నత స్థాయి ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని ప్రకటించారు. బీఎన్ఐ సభ్యులతో సహా మొత్తం 1500 మంది ప్రతినిధులను సదస్సుకు ఆహ్వానించినట్లు వివరించారు. చెన్నైకు చెందిన ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ అన్నాదురై ప్రసంగం ఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం 8367577779 హెల్ప్‌లైన్ నెంబరుకు సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా నెట్వర్కింగ్ కన్‌క్లేవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కన్‌క్లేవ్ చైర్మన్ త్రినాథ్ నండూరి, కన్వీనర్ యడ్ల పార్థసారధి, కోర్ కమిటీ సభ్యులు తిరుమల కుటుంబరావు పాల్గొన్నారు.





వరుణ్ బజాజ్‌లో లక్కీడ్రా

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: బెంజిసర్కిల్ వద్ద గల వరుణ్ బజాజ్ షోరూమ్‌లో బుధవారం సాయంత్రం వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లలో భాగంగా లక్కీ డ్రా నిర్వహించారు. షోరూమ్‌లో డిసెంబరు 25 నుండి జనవరి 31వ తేదీ వరకు బజాజ్ వాహనాలు కొనుగోలు చేసిన వారిని బహుమమతులు అందించేందుకు లక్కీ డ్రా నిర్వహించినట్లు వరుణ్ మోటార్స్ సేల్స్ సీఈవో పద్మజ తెలిపారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి ఏసీ, రెండో బహుమతి రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి టెలివిజన్, నాల్గో బహుమతి వాషింగ్ మెషీన్, ఐదో బహుమతి వెట్ గ్రైండర్ అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ వెంకట్, సర్వీస్ జీఎం గంగాధర్, వినియోగదారులు, వరుణ్ బజాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-భవానీపురం: కొండ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం మెట్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య చెప్పారు. బుధవారం కబేళా సెంటర్ తాజ్ హోటల్ కొండ ప్రాంతంలో సుమారు రూ.5.40 లక్షలతో మెట్లు డ్రైన్ల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే వెలంపల్లి ఆదేశాల మేరకు మెట్లు, డ్రైన్ల నిర్మాణానికి కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారని వివరించారు. 45వ డివిజన్ సమగ్ర అభివద్ధికి కషి చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మైలవరపు కష్ణ, ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, లక్ష్మి, కోటేశ్వరి పాల్గొన్నారు.

